# నేర్చుకో

పేషంట్ తాలూకు బంధువుతో ఓ అర్ధగంట ఘర్షణపడి పిండవలసిన మేరకు పిండి జేబిలో కుక్కుకొంటూ నా వైపు అలవోకగా చూసి "నేర్చుకో" అన్నాడు డాక్టర్ సుబ్బరాజు.

నేర్చుకొనేందుకే నేనిక్కడ చేరాను. అయితే నేర్చుకొనేదేమిటో నా కింకా పూర్తిగా అర్థంకాలేదు. పదిమందికి పెట్టేంత స్తోమత లేకున్నా, చేసాయమన్నా చేద్దామనే తపన మొదట్నించి నాకుంది.

ఇంటర్ పూర్తవగానే పై చదువులకు కుదరక బాగా ఆలోచించే నేనిక్కడ చేరాను. ఇందుకు నేనెంతో ఆనందపడ్డాను కూడా - దారిలోనే చావకుండా కనీసం టౌను వరకన్నా మాపల్లె రోగుల్ని తీసికెళ్లేందుకు నేను నేర్చుకొనే పని ఉపయోగపడుతుందని.

నా ఆరునెలల కాంపౌండర్ సర్వీసులో ఇప్పటికే చాలాసార్లు డాక్టర్ ఆమాటన్నాడుగాని, దానర్థం నాకింకా సరిగ్గా బోధపళ్లేదు.

పేషంట్ తెచ్చిన సూది మందును సిరంజికెక్కించబోతోంటే, నావైపు ఉరిమి చూసి, బాటిల్ పక్కన పడేసి క్రితం పేషంట్ తాలూకు మందుమిగిలిన బాటిల్ నాకిస్తూ "నేర్చుకో" అన్నాడు డాక్టరు మొదటిసారి ఐదునెలల క్రితం. అందులో తిరకాసేదో నాకర్థం కాలేదు.

అవసరం లేనపుడు పేషంట్ల చేత మందు తెప్పించటం ఎందుకోమరి?

తర్వాత...కలరా సీజన్‌లో అనుకొంటా - నైట్ డ్యూటి చేయాల్సి వచ్చినపుడు, రోగుల బాధ చూడలేక తెల్లార్లూ వాళ్ల బాగోగులు చూస్తూ మేలుకొని, ఎర్రటి నిద్రమత్తు కళ్లతో ఉదయం డాక్టర్ వద్దకెళ్లినపుడు "తెల్లార్లూ మేలుకొన్నావా? మరీ అంత సెన్స్‌లెస్‌గా ప్రవర్తిస్తే ఎలా? "నేర్చుకో" అన్నప్పుడు కూడా ఆ మాటకు అర్థం తెలిసి చావలేదు.

నేర్చుకోవటమంటే నా దృష్టిలో రోగులకు సేవలు చేయటం కాని, ఆ అర్థం నాకిక్కడ ఆయన మాటల్లో స్ఫురించట్లేదు. డాక్టరుగారు సూచించే మరో అర్థం కోసం ఎంత ప్రయత్నించినా నాకు అవగతం కావట్లేదు.

కలరా సీజన్ ఆరంభంలో డాక్టర్ అనేవాడు "ఇంకా వెధవ వర్షాలు రాలేదోయ్" అని.

"వర్షాలు రాకుంటే మాలాంటి రైతులగ్గాని, మీకేం ఇబ్బంది సార్?" అని నేనంటే,

"అక్కడే నువ్వు పప్పులో కాలేస్తున్నావ్. వర్షాలొస్తేనే గదా మన బిజినెస్ మూడు సెలైన్‌లు ఆరు ఫీజులుగా రన్నయ్యేది. పూర్‌ఫెలో... నేర్చుకో..." అన్నాడు.

వైద్యాన్ని బిజినెస్ అనటంలోగల మర్మం నాకప్పుడు సరిగ్గా అర్థం కాలేదు గాని, తర్వాత పదిరోజులకే బాగా స్పష్టంగా తెలిసివచ్చింది.

ఎండాకాలం నీళ్లమ్ముకొనే కూల్‌డ్రింక్ షాపులకీ, వానాకాలం నీళ్ల మందు అమ్ముకొనే ఆస్పత్రులకీ మించిన బిజినెస్ మరొకటిలేదని మా మిత్రుడొకడు అనే మాటకి అర్థం ఆ రోజు బాగా అనుభవానికొచ్చింది.

ఆ రోజు... పదిగంటల ప్రాంతంలో ఏడుపు కేకల భుజాల మీదుగా ఓ పేషంట్ వచ్చింది.

వయస్సు అరవై ఏళ్లుంటాయి. అస్థిపంజరానికి చర్మపు తొడుగేసి కందెన పూసినట్లుంది. వాంతులు బేదులకు కూడా ఓపిక లేని స్థితిలో ఉంది.

మా డాక్టరు బాగా హడావిడి చేశాడు.

పేషెంట్ వచ్చిన ప్రతి మొదటి క్షణాల్లో ఇలాగే కల్లోల సముద్రమవుతాడు. చివరి క్షణాలు సమీపించే కొద్దీ ఎందుకోమరి ప్రవాహం సాగిపోగా అక్కడక్కడా గుంటల్లో మిగిలిన నీళ్లలా నిర్వేదంగా ఉంటాడు.

సెలైన్ బాటిల్ లోంచి ఒక్కోబొట్టు నిశ్శబ్దంగా హృదయంలో క్షణాల్ని లెక్కబెడుతూ రాల్తోంటే అక్కడి పరిస్థితి కొద్దిగా సద్దుమణిగింది.

పేషంట్లను చెక్‌జేసి డాక్టర్ మధ్యాహ్న భోజనానికి ఇంటికెళ్లాడు. ముసలామెకు సంబంధించిన మనుషులు మంచం పక్కన నిల్చుని ఉన్నారు.

ఎండిన రేగుకంపలాంటి జుత్తుతో, కాయకష్టం వల్ల కమిలిన ఒంటితో, ఆమె కూతురు కాబోలు ఒక ఆడమనిషి మంచంపక్కనే కూచుని ఆందోళన పడుతూంది. వాంతులు, బేదులతో తడిసిన ఆమె గుడ్డల్ని సరిజేస్తోంది.

మిగిలిన ఇద్దరు మగాళ్లు ఒక విధంగా అటు ఇటు తప్పుకు తిరుగుతున్నారు. నిజం చెప్పాలంటే అసహ్యం ఫీలవుతున్నారు.

"మీ అమ్మే నామ్మా ఈమె?" అడిగాను మంచం పక్కనున్నామెను. "అవున్సారూ!" చెప్పింది. "నేనొక్కదాన్నే మాయమ్మకు. బోకట్టం జేసే ముసల్ది సారూ! నిన్న గూడా గంపెడు గడ్డితెచ్చింది. సందెదు కట్టెల్దెచ్చింది. రెక్కలు ముక్కలయ్యేట్టు పన్జేసి ఇన్నాల్లూ మమ్మల్ను సాకింది. వొద్దే... సద్దిసంగటి తినొద్దే అంటే ... పాసిపోయిన సద్ది దాంగింది... మా పానాలమీందికి దెచ్చింది" అంది ముక్కుచీదుకుంటూ.

"పొద్దుగూకే వయసు సారూ! రోగాలూ రొస్టులూ రాకుండా యాడుంటయ్... ఏదో.... బతికితే యింటికాడ ఆ పని ఈ పని జేస్చా వుంటదని తీసుకొచ్చినం." చెప్పాడు ముసల్దాని అల్లుడు కాబోలు చాలా తేలిగ్గా.

అతని మీద నాకు అసహ్యం కలిగింది. 'మనుషులమధ్య ఇంత తేలికపాటి సంబంధాలుంటాయా?' అన్పించింది. జీవితాంతం వాళ్ల కోసం అవయవాల్ని అరగదీసికొన్న ముసలామె ఈనాడు అవసరం లేనిదిగా కన్పిస్తోంది.

ఇదేరోగం - పనిచేయలేని స్థితిలో - అమెను ఆశ్రయించి వుంటే పరిస్థితి ఎలావుండేదో మరి? బహుశా హాస్పిటల్ అనేది ఒకటుందనే విషయం మెదడులో తట్టి ఉండేది కాదేమో!

అర్థగంట తర్వాత అతనే మాట్లాడాడు. "బాటల్లు యింగా తేవాల్నా సారూ?" అని

"ఏమో?.. అవసరపడొచ్చు. డాక్టర్ రావాలిగదా!" చెప్పాను.

"ఇంటికి బోవాల సార్!" అన్నాడు.

నాక్కోపం వచ్చింది. "ఇద్దరైనా పేషంట్ వద్ద ఉండకుంటే ఎలా?" చెప్పాను.

వెంటనే అతను గొంతు విప్పాడు. "కూలికిబోతే కదుపునిండాల సార్! ముసిల్దాన్ని యిడ్సి పోవాలంటే నాకు నొప్పిగానే వుంది. అయితే.. సచ్చేదానికోసరం నేనీడుంటే యింటికాడ పిల్లోల్లు కదుపెండి సస్పురు సారూ! కదుపుకింత గంజైనా పొయ్యాలగద్సారూ!"

నాకు తల తిరిగిపోయింది.

వాళ్ల ఆవేదన బాగా అర్థమైంది.

ఆర్థిక సంబంధాల ముందు మానవ సంబంధాలు పండాకులే మరి!

నా శక్తిమేరా వాళ్లకు సహాయం చేయాలని నిశ్చయించుకొన్నాను.

పోతూ పోతూ కొంత డబ్బు భార్య చేతిలో పెట్టి పోయాడతను. ముసలామె పరిస్థితి ఆందోళనకరంగానే ఉంది.

సాయంత్రం ఐదు గంటల దాకా డాక్టర్ కూడా అవీఇవీ సజెస్ట్ చేసి పెదవి విరిచాడు.

"చాలా సీరియస్ కేస్." చెప్పాడు ముఖమంతా ఆభావం ప్రతిఫలించేలా. "ఈవిడ అనీమిక్ పేషంట్. అందులోనే సివియర్ కలరా. రెండ్రోజులు ముదరబెట్టి తెచ్చారు. పాతకాలపు పిండమై బతికింది. ఇంకొకర్తె ఉంటే యింటి వద్దే ...." 'చావాల్సింది' అన్నట్లుగా చేయి వూపుతూ, పెదవి విరుస్తూ మరో పేషంట్ వద్దకు నడిచాడు. బ్రద్దలయ్యేందుకు సిద్ధంగా ఉంది ముసలామె కూతురు.

"నీ కాల్లు బడతా సారో! మాయమ్మని బతికియ్యండి. ఈ ముండే మాకు పెద్దదిక్కు సారో!" అంది డాక్టర్ కాళ్లమీద పడుతూ.

"మేముండేదీ బతికియ్యాలనే...." అంటూ మరో పేషంట్ జబ్బలో సూది బలంగా దించి "దబ్బుందా?" అడిగాడు. ఎవర్నో అర్థంగాక ఆమె దిక్కులు చూస్తోంటే "నిన్నే..." అన్నాడు గట్టిగా.

"ఉంది సార్!" చెప్పింది ఆమె.

"అయితే... హెమాక్సిల్ అని మందుబాటలుంది. రాసిస్తా, తెచ్చుకో.." అంటూ సిరంజిలాగి నాకందిస్తూ తన సీటు వద్దకెళ్లాడు.

ప్రిస్క్రిప్షన్ రాసి ఆమె చేతిలో పెడుతోంటే అడిగింది. "ఎంత యద్ది సారూ!" అని "డెబ్బై ఐదురూపాయలు" చెప్పాడు.

ఆమె లబోదిబోమంది.

"నాకాడ అంత లెక్కలేదు సారూ! మా యింటాయన గూడా లేదు." అంటూ ఏడ్చింది.

"పిల్చుక రా ఫో..." కోపంలో అసహ్యతను మేళవించి గాండ్రించాడు.

ఆమె ఆదరాబాదరా బైటికెళ్ళింది.

వాళ్ల బతుకుల మీద నాకు చాలా జాలేస్తోంది. తల్లికోసం నిజంగా బాధపడుతోంది ఆమె.

పావుగంటలో భర్తను వెంటేసుకొచ్చింది.

అతన్ని చూడగానే డాక్టర్ మండి పడ్డాడు. "నీ కసలు బుద్ధుందటయ్యా? ఇంత సీరియస్ కండిషన్లో కూడా మీలాంటి వాళ్లు యిలా అజాగ్రత్తగా ప్రవర్తించబట్టే మేమేం

చేయలేకపోతున్నాం. మాకుండే శ్రద్ధలో పదోవంతన్నా మీకూ ఉండాలిగా! హాస్పిటల్లో తెచ్చి పడేస్తే సరిపోతుందా? డాక్టరేమన్నా దేవుడనుకున్నారా? బుద్ధుండాలయ్యా...బుద్ధి..." అంటూ గట్టిగా మందలిస్తూ "ఆ చీటిలో మందు తెచ్చుకొంటావా? పేషంట్‌ను ఇంటికి తీసికెల్తావా? " అడిగాడు సీరియస్‌గా.

అతను రెండుచేతులు ముకుళించి "దయజూపండి సారూ! కూలినాలి జేసుకొనేటోల్లం. యీడికే మా ఆడదాని తాలిబొట్టు కుదవబడింది." ప్రాధేయపడ్డాడు.

"నీకు తెలిసిన వాళ్ల వద్ద అప్పు తీసుకొని పట్రాపో..." డాక్టర్ గద్దించటంతో అతను బైటకు పరువెత్తాడు.

తల్లి మంచం వద్దకెళ్లి ఆమె ఆరాటపడుతోంది.

మంచం చుట్టూ తిరుగుతోంది.

తల్లి ముఖంలోకి గుచ్చిగుచ్చి చూస్తోంది. లోతుల్లో దాగిన జీవకళ సాక్షాత్కరిస్తుందేమోనని.

కనుగుడ్ల ధారలు కారుస్తోంది.

నాకు గుండె తరుక్కుపోతోంది.

ఏదో తపన. మరేదో ఆవేదన – వీళ్లకు నేనెలా సహాయపడాలా? అని.

డాక్టరును అడిగాను, " చాలా బీదవాళ్లలా ఉన్నారు సార్! అంతరేటు మందులు వాడాల్నంటారా? అవి వాడినా ఫలితముందా? ఉపయోగం లేని వైద్యమైతే – వాళ్లచేత ఖర్చుపెట్టించటం ఎందుకు?" అని.

నాకేసి సీరియస్‌గా చూశాడు డాక్టర్. "ఈ రోగానికి ఇదే సరైన ట్రీట్‌మెంట్. మన ప్రయత్నం మనం చేయాలిగదా?" చెప్పాడు.

పావుగంటలో తిరిగి వచ్చాడు అతను – హెమాక్సిల్ బాటిల్‌తో. అప్పటికే చీకటి పడింది.

లో వోల్టేజి కారణంగా బల్బులు ఎర్రగా మినుకు మినుకు మంటున్నాయి.

బాటిల్ తీసుకొని కర్టన్ చాటుకెళ్లాడు డాక్టర్. నిమిషం తర్వాత నన్ను పిల్చాడు లోపల్నించి

ఖాళీ అయిన సెలైన్ బాటిల్ తీసి మంచి బాటిల్ తగిలించి డాక్టర్ వద్దకెళ్లాను.

"కొద్దిగా మిగిలిన హెమాక్సిల్ బాటిల్ వుండాలనుకొంటా – నిన్నటిది." నాకేసి చూస్తూ అడిగాడు.

"ఉంది సార్!" చెప్పాను. నాలో ఏదో ఆశ – డాక్టరుగారు వాళ్లకేమైనా సాయం చేయక పోతారా? అని.

"తీసకరాపో.."

స్టోర్ రూంలో కెళ్లి నిన్నటి బాటిల్ గుర్తించి పట్టుకొచ్చాను. బాటిల్‌లో ఇంకొంత హెమాక్సిల్ ద్రావణం మిగిలివుంది. "కోడూరు పేషంట్ పరిస్థితి ఎలావుందో చూడు." బాటిల్ అందుకొంటూ చెప్పాడు.

"ఇప్పుడే సెలైన్ మార్చాను సార్!

"బ్రాలాజుపల్లె పేషంట్...?"

నేను పేషంట్లకేసి కదిలాను. ఒక్కొక్కరినీ చెక్‌జేసికొంటూ వచ్చేసరికి డాక్టర్ హెమాక్సిల్ బాటిల్‌తో ముసలామె మంచం వద్దకు వచ్చాడు.

బాటిల్ స్టాండుకు తగిలించి నీడిల్ ఆమెచేతి నరానికి గుచ్చుతూ "ఇందులో మూడు ఇంజక్షన్లు కూడా ఎక్కించాను. బాటిల్ పూర్తయ్యేసరికి ఖచ్చితంగా కోలుకోవాలి." చెప్పాడు.

రోగులందర్నీ ఒకసారి చెక్‌జేసి ఇంటికెళ్లాడు.

రోగుల తాలూకు బంధువులు టిఫిన్ కారియర్లలో, సద్దిగుడ్డల్లో తెచ్చుకొన్న అన్నాన్ని తినేందుకు సిద్ధమయ్యారు.

రోగులకు బ్రెడ్డు పళ్లలాంటివి తినిపిస్తున్నారు కొందరు.

బల్బులు ఒక్కసారిగా పూర్తి జీవం పుంజుకొన్నాయి.

నేనూ కర్టన్ చాటుకెళ్లి నాలుగు మెతుకులు తిని బైటికొచ్చేసరికి ముసలామె మంచం వద్ద ఆమె కూతురు ఆరటపడ్తూ కన్పించింది.

"నాకేందో బయమేస్తాంది సారో!" అంది పైటచెరగు నోట్లో కుక్కుకుంటూ.

నేను మంచం దగ్గరగా వెళ్లి నిల్చున్నాను.

ముసలామె మొహంలో జీవకళ బాగా తగ్గింది. ఆమెలో చైతన్యం ఓల్టేజి తగ్గుతోన్న బల్బులా క్రమంగా బలహీనమవుతోంది. పల్స్‌కూడా వీక్‌గా ఉన్నాయి. ఊపిరి నెమ్మదిగా జరుగుతోంది.

ఆమెలోంచి ఏదో జారిపోయే స్థితి.

నాకు కంగారేసి డాక్టర్ ఇంటి వద్దకెళ్లాను.

"ఏమయ్యా?" పలుకరించాడు డాక్టర్. "ఎనీ సీరియస్?" అడిగాడు వెంటనే.

చెప్పాను.

డాక్టర్ తాపీగా వూపిరి వదిలేశాడు. "అది నాకు ముందే తెలుసు. ఆఖరి ప్రయత్నం చేశాను... ఐయామ్ సారీ... ఆమె బతకదు. నువ్వేం బాధపడాల్సిన పన్లేదు. ఇంటి దగ్గరే సీరియస్ కండిషన్. మనమేం చేద్దాం చెప్పు? ఎవ్వరినీ ఏడవనీయొద్దు - హాస్పిటల్‌కి చెడ్డపేరు." చెప్పాడు.

నేను హాస్పిటల్ వెళ్లాను.

ఇంకా పాతిక భాగం మందు ఉంది బాటిల్‌లో ముసలామె ప్రాణాలు జారిపోయే స్థితిలో ఉన్నాయి. డాక్టర్ గారి చివరి సందేశం అందించాను. తర్వాత పదినిమిషాలకే ముసలామె చివరి శ్వాస వదిలింది. కొద్దిపాటి రోదనల వెనక శవం బైటకు కదిలింది. నేను పడుకున్నాను గాని నిద్రరావట్లేదు. వాళ్ల బీదతనమే కళ్లముందు మెదల్తోంది.

ముసలామె గాజుకళ్ల నిశ్చలత్వమే కంటిరెటీనా మీద దృశ్యాలుగా అలముకొంటోంది.

లేచి ఆమె మంచం వద్ద స్టాండుకున్న బాటిల్ తీసాను - స్టోర్ రూంలో పడేద్దామని.

నాకేదో అసహజత్వం తోచింది, బాటిల్ చేతిలోకి తీసుకోగానే

చాలా పల్చటి రంగు.

ఇంతదాకా నిశిత దృష్టితో చూడలేదు.

రంగు వెలసిన ద్రావణం... మందులు ఎక్కించానన్నాడు. అయినా యింతగా రంగు మారదుగా!

నాలో అనుమానం వేరుపురుగైంది.

కర్టన్ వెనక టేబుళ్ల మీద వెదికాను.

స్టోర్ రూంలో గాలించాను.

ఊహూ... నా సందేహానికి సాక్ష్యం దొరకలేదు... బీరువా బీగాలు నావద్దలేవు.

తెల్లార్లూ అనుమానం నన్ను పురుగులా తొలుస్తూనే ఉంది. ఉదయం పది గంటల ప్రాంతంలో బాటిల్ నాచేతికిచ్చి "హైమ మెడికల్స్ వాళ్ల కిచ్చిరా, నేనిచ్చానని చెప్పు." అని డాక్టర్ అన్నపుడు నాకు ఒళ్లంతా కంపరమెత్తింది.

"ఇది...రాత్రి ముసలామెకు సంబ..." నేను పూర్తిచేయబోయే లోపలే "అవును... వెళ్లి ఇచ్చిరా." చెప్పాడు.

డాక్టర్‌మీద నాకు నరనరాల్లో అసహ్యం పెల్లుబికింది. "అంత బీదవాళ్ల వద్ద యీ పని చేయటం బాగలేదు సార్! కొద్దిగా మిగిలిన హెమాక్సిల్‌లో నీల్లు కలిపి ఆమెకు ఎక్కించినట్లున్నారు. అందుకే చచ్చింది. అసలు మందు ఎక్కించి వుంటే బతికుండేదేమో!" అన్నాను.

"డోంటాక్ ఫూలిస్‌లీ." గద్దించాడు. "అంత సీరియస్ కండిషన్‌లో వుండే ఏజ్డ్ పర్సన్ బతకటం ఎక్కడైనా చూశావా? చావటం ష్యూర్. ఏదో మన ప్రయత్నం మనం చేయాలి కాబట్టే యీ వైద్యమంతా".

"అలాంటపుడు మీరు అనవసరంగా కూటికిగూడా గతిలేని వాళ్ల చేత అన్ని అవస్థలు పెట్టి బాటిల్ తెప్పించటమెందుకు?" నాలో ఆవేశం పొంగుతోంది.

డాక్టర్ నాకేసి పిచ్చివాణ్ణి చూసినట్లు చూశాడు.

"ఆమె చస్తుంది. ఫీజెవడిస్తాడు? నువ్విస్తావా? ఇలాంటి కేసుల్ని నా సర్వీసులో ఎన్నో చూశాను. వాళ్ల వద్ద ఫీజు రాబట్టాలంటే ఇంతకన్నా గత్యంతరంలేదు. ఫూలిస్‌గా ప్రవర్తించకుండా చూసి నేర్చుకో" చెప్పాడు.

నాకు అసహ్యంతోబాటు కోపం నసాళాని కంటింది.

"ఛీ... నేను మీ వద్ద వైద్యం నేర్చుకొందామని వచ్చానే గాని - శవాలతో వ్యాపారం చేసేందుక్కాదు. ఇది నేర్చుకోవటం కన్నా వీధుల్లో అడుక్కోవటం మేలు." గట్టిగా అరుస్తూ బాటిల్ నేలకేసి విసిరి విసవిసా బైటకు నడిచాను.

పగిలిన బాటిల్ శబ్దం నాచెవుల్లో భళ్లుమంది. పేషంట్ల తాలూకు బంధువులు వింతగా నాకేసి చూడటం కంటి చివర్లోంచి స్ఫురిస్తూనే ఉంది.

◆ *ఆంధ్రజ్యోతి వీక్లీ - 26.4.1991* ◆